క్లుప్తంగా

ఒక కనెక్షన్‌కు మాత్రమే 'దీపం' వర్తింపు

అంబాజీపేట: దీపం పథకంలో ప్రభుత్వ నిబంధన ప్రకారం ఒక కుటుంబంలో ఎంత మంది ఉన్నా ఒకరికి మాత్రమే కనెక్షన్ వర్తిస్తుందని తహసీల్దార్ జె.వెంకటేశ్వరి అన్నారు. ఏడాదికి మూడు సిలిండర్లు మాత్రమే ప్రభుత్వం ఉచితంగా ఇస్తుందన్నారు. ఆధార్, ఈ-కేవైసీ చేయించుకోని వారు తక్షణమే దగ్గరలో ఉన్న గ్యాస్ కంపెనీల వద్ద గాని, డెలివరీ బాయ్స్ వద్ద గాని చేయించుకోవాలన్నారు.

నేడు వెంకన్నకు లక్షతులసి పూజ

అంబాజీపేట: ఇసుకపూడి శివారు జక్కంశెట్టివారిపాలెంలో వేంచేసిన శ్రీ, భూ సమేత వేంకటేశ్వర స్వామికి సామూహిక లక్షతులసి మహోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ భక్త బృందం తెలిపారు. సాయంత్రం ఆరు గంటలకు దీపోత్సవం, పూర్ణాహుతి, ఉయ్యాల సేవ నిర్వహించనున్నామన్నారు. సాయంత్రం ఆలయ ప్రాంగణం వద్ద భారీ అన్నసమారాధన చేపట్టనున్నట్లు తెలిపారు.

కనులపండువగా విగ్రహ ప్రతిష్ఠ

అంబాజీపేట: పుల్లేటికుర్రులో అభయ ఆంజనేయ స్వామి వారి 27 అడుగుల ఆవిష్కరణ, శిలామయ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని అభయ ఆంజనేయ స్వామి వారి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం కనులపండువగా ప్రతిష్ఠించారు. పండితులు శ్రీనివాసుల విజయ్‌గోపాలాచార్యుల బ్రహ్మత్వంలో శిలామయ ఆంజనేయ స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠ, సుధామయ ఆంజనేయ స్వామి వారి విగ్రహావిష్కరణ చేశారు. అంతకుముందు శిలామయ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ, ఆవిష్కరణ, మహాశాంతి హోమం, పూర్ణాహుతి, కళావాహన, పండిత సత్కారం తదితర కార్యక్రమాలు జరిపించారు. అనంతరం భారీ అన్నసమారాధన చేపట్టనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. స్వామిని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, నాయకులు బొంతు పెదబాబు, వాసంశెట్టి చినబాబు, శిరిగినీడి వెంకటేశ్వరరావు తదితరులు దర్శించుకున్నారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న వ్యాన్

ఆలమూరు: 216 ఏ జాతీయ రహదారిలోని మూలస్థాన అగ్రహారం వద్ద ఆగి ఉన్న ఆర్టీసీ బస్సును వ్యాన్ ఢీకొన్న సంఘటనలో ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం రాజమహేంద్రవరం వైపు నుంచి రావులపాలెం వెళుతున్న ఆర్టీసీ బస్సు స్థానిక బస్టాండులో ప్రయాణికులను ఎక్కించుకునేందుకు నిలిచి ఉంది. అంతలో అదే రోడ్డులో వేగంగా వస్తున్న వ్యాన్ వెనుక నుంచి బస్సును ఢీకొంది. ఈ ప్రమాదంలో వ్యాన్‌లో ఉన్న డ్రైవర్, క్లీనర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అంతలో సంఘటన స్థలానికి ఆలమూరు పోలీసులు, హైవే సిబ్బందికి చేరుకుని హైవే అంబులెన్స్ సాయంతో క్షతగాత్రులను రాజమహేంద్రవరం ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు ఎస్సై ఎం.అశోక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా పడి పూజ

మామిడికుదురు: అయ్యప్పస్వామి పడి పూజ గురువారం రాత్రి అప్పనపల్లిలో వైభవంగా జరిగింది. గొడవర్తి శ్రీనివాస్, కృష్ణవేణి దంపతుల ఆధ్వర్యంలో జరిగిన పడి పూజకు భారీ సంఖ్యలో స్వాములు హాజరయ్యారు. పాశర్లపూడి గ్రామానికి చెందిన తోరం రామారావు గురుస్వామి ఆధ్వర్యంలో ఈ పూజ ఆద్యంతం కనులపండువలా జరిగింది. దీనిలో భాగంగా వినాయకునికి, సుబ్రహ్మణ్యస్వామికి, కనకదుర్గమ్మకు ప్రత్యేక పూజలు జరిపించారు. అయ్యప్ప స్వామికి పంచామృతాలు, పుష్పాలతో అభిషేకం చేశారు. అనంతరం సహస్ర నామాలతో అర్చన చేశారు. అప్పనపల్లికి చెందిన కామిశెట్టి సూరిబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన భజన కార్యక్రమం భక్తులను విశేషంగా అలరించింది.

తాగునీటి సరఫరా మెరుగుదలకు అధిక ప్రాధాన్యం



వాటర్ ట్యాంకు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వరప్రసాద్

సఖినేటిపల్లి: నియోజకవర్గంలోని గ్రామాల్లో తాగునీటి సరఫరా మరింత మెరుగుపర్చేందుకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. శుక్రవారం రామేశ్వరం శివారు శ్రీరామగరువు కాలనీలో తాగునీటిని సరఫరా చేసే పైపులైన్‌ను ఆయన ప్రారంభించారు. కేశవదాసుపాలెం దుర్గా సెంటర్‌లో ఓఎన్జీసీ ఈసీ ఫండ్‌తో నిర్మించనున్న వాటర్ ట్యాంకు పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అదే గ్రామంలో ఆచంటవారి గ్రూపులో నూతనంగా నిర్మించిన వాటర్ ట్యాంకును ఆయన ప్రారంభించారు. వీటితో పాటు శృంగవరప్పాడులో ఓఎన్జీసీ ఈసీ ఫండ్స్‌తో నిర్మించే వాటర్ ట్యాంకు నిర్మాణ పనులకు కూడా ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. జెడ్పీటీసీ దొండపాటి అన్నపూర్ణ, ఎంపీపీ వీరా మల్లిబాబు, సర్పంచ్ రావి నాగవెంకట లక్ష్మీదేవి, ఏపీ మార్క్‌ఫెడ్ రాష్ట్ర డైరెక్టర్ జి.పెదకాపు, నాయకులు రావి త్రిమూర్తులు, గుబ్బల ఫణి, గెద్దం మహాలక్ష్మి ప్రసాద్, ముప్పర్తి నాని, యెనుముల సుబ్బారావు, ఉండపల్లి అంజి, అల్లూరు రంగరాజు పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా నిర్వహణ

- నిర్లక్ష్యపు నీడలో పి.గన్నవరం కొత్త అక్విడెక్ట్
- ధ్వంసమైన రోడ్డుతో ప్రయాణికులకు ఇబ్బందులు
- లైట్లు వెలగక అంధకారం



అక్విడెక్ట్‌పై జాయింట్ల వద్ద ధ్వంసమైన రోడ్డు



నడకదారిలో ధ్వంసమైన బల్లలు

పి.గన్నవరం: స్థానిక కొత్త అక్విడెక్ట్ నిర్వహణ అస్తవ్యస్తంగా ఉండటంతో ప్రజలు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒక వైపున రోడ్డుపై గుంతలు, మరో వైపు రాత్రి వేళల్లో లైట్లు వెలగక అంధకారంలో అక్విడెక్ట్ కొట్టుమిట్టాడుతోంది. దీంతో అక్విడెక్ట్‌పై వెళ్లే ప్రయాణికులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నగరం దీవికి సాగు, తాగునీరు అందించే పాత అక్విడెక్ట్ శిథిలం కావడంతో దాని స్థానే నిర్మించిన కొత్త అక్విడెక్ట్‌ను 2000లో ప్రారంభించారు. దీనిపై నిత్యం వేలాది వాహనాలు ప్రయాణిస్తుంటాయి. గత కొన్నేళ్లుగా జాయింట్ల వద్ద రోడ్డు ధ్వంసమై గోతులు ఏర్పడుతున్నాయి. గోతులు పూడుస్తున్నా మళ్లీ కొంత కాలానికి పాడవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇటీవల కాలంలో జాయింట్ల వద్ద రోడ్డు ధ్వంసమై ఇనుప చువ్వలు బయటకు వస్తున్నాయి. గోతుల్లో పడిన ద్విచక్ర వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. వాహనాల టైర్లు పంక్చర్ అవుతున్నాయి. భారీ వాహనాల రాకపోకలతో జాయింట్ల వద్ద ఏర్పడుతున్న కుదుపులతో అక్విడెక్ట్‌పై భారం ఎక్కువవుతోంది. అక్విడెక్ట్ రోడ్డుపై గోతులు పూడ్చాలని అధికారులను, ప్రజా ప్రతినిధులను కోరుతున్నా ఎవరూ స్పందించడం లేదని ప్రయాణికులు, ప్రజలు ఆరోపిస్తున్నారు. అలాగే రోడ్డుకు ఇరువైపులా పాదచారులు నడిచేందుకు ఏర్పాటు చేసిన సిమెంటు బల్లలు కూడా పలు చోట్ల ధ్వంసమై ప్రమాదాలకు నిలయంగా మారాయి. పి.గన్నవరం వైపున అక్విడెక్ట్ ముఖద్వారం వద్ద ఆర్అండ్‌బీ రోడ్డు కూడా ధ్వంసం కావడంతో ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతున్నారు. అలాగే అక్విడెక్ట్‌పై ఏర్పాటు చేసిన లైట్లు గత కొన్నేళ్లుగా వెలగడం లేదు. దీంతో రాత్రి వేళల్లో అంధకారం నెలకొని ప్రమాదాలు జరుగుతున్నాయి.

పాఠశాలలు, కళాశాలల నుంచి అక్విడెక్ట్ మీదుగా ఇళ్లకు వెళ్లే ఎల్.గన్నవరం, జొన్నల్లంక, మొండెపులంక, పుచ్చల్లంక తదితర గ్రామాలకు చెందిన విద్యార్థులు రాత్రి వేళల్లో బిక్కుబిక్కుమంటూ ప్రయాణిస్తున్నారు. ఆకతాయిల నుంచి ఎప్పుడు ఏ ఇబ్బందులు ఎదురవుతాయోనని భయాందోళన చెందుతున్నారు. లైట్లు వెలగకపోవడంతో గత సెప్టెంబర్ 23వ తేదీ రాత్రి అక్విడెక్ట్ కాలువ వైపున ఉన్న తనిఖీ రహదారిపై రూ.1.5 లక్షల విలువైన 16 ఇనుప రెయిలింగ్స్‌ను దొంగలు అపహరించుకుపోయారు. దీనిపై అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇకనైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి అక్విడెక్ట్ రోడ్డుకు మరమ్మతులు నిర్వహించాలని, లైట్లు వెలిగించేందుకు చర్యలు చేపట్టాలని విద్యార్థులు, ప్రయాణికులు, పరిసర గ్రామాల ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపాం: ఏఈ

రూ.85 లక్షలతో కొత్త అక్విడెక్ట్ మరమ్మతుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. రోడ్డుపై ఒక పొరను తొలగించి, రోడ్డు వేసేందుకు రూ.50 లక్షలు, లైట్ల కోసం రూ.30 లక్షల విలువైన ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరైన అనంతరం పనులు చేపడతాం.

నిధులు విడుదల చేయాలి



కొత్త అక్విడెక్ట్‌పై నెలకొన్న సమస్యల వల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపై ఏర్పడ్డ గోతుల వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రయాణికులు గాయాల పాలవుతున్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి మరమ్మతులకు నిధులు విడుదల చేయాలి.

– చెల్లుబోయిన సాయిబాబు, పి.గన్నవరం

రాత్రి వేళల్లో ఇబ్బందులు పడుతున్నాం..



నేను పి.గన్నవరం హైస్కూల్‌లో చదువుతున్నాను. స్కూలు అనంతరం ట్యూషన్ నుంచి బయటకు వచ్చేలోగా చీకటి పడుతోంది. అక్విడెక్ట్‌గా మీదుగా ఇంటికి తిరిగి వెళ్లాలి. రాత్రి వేళలో అక్విడెక్ట్‌పై లైట్లు వెలగకపోవడంతో చీకటిగా ఉంటోంది. దీంతో భయమేస్తోంది. అక్విడెక్ట్‌పై విద్యుదీకరణను పునరుద్ధరించాలి.

– శృంగవరపు బిందు, విద్యార్థిని, ఎల్.గన్నవరం

రేషన్ బియ్యం అమ్ముకోవద్దు

కొత్తపేట: ప్రధాని నరేంద్రమోదీ గరీబ్ కల్యాణ్ యోజన ద్వారా సరఫరా చేస్తున్న పోషకాలతో కూడిన రేషన్ బియ్యాన్ని అమ్ముకోవద్దని రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం ప్రజలకు సూచించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా బీపీఎల్ కుటుంబాలకు ఆహార భద్రత కల్పించడంలో భాగంగా ప్రతీ కుటుంబంలో ఒక్కొక్కరికీ 5 కేజీల చొప్పున ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తున్న విషయం తెలిసిందేనన్నారు. అర్హులందరూ బియ్యం తీసుకుంటున్నా.. వారిలో చాలా మంది వినియోగించుకోవడం లేదన్నారు. సన్న బియ్యానికి అలవాటు పడి కొందరు, అన్నం మెత్తబడిపోతుందనే అపోహతో మరికొందరు పోషకాలతో కూడిన విలువైన బియ్యాన్ని ప్రైవేట్ వ్యాపారులకు రూ.20 విక్రయిస్తున్నారన్నారు. అలాంటి వారికి తాజాగా ఆరోగ్య నిపుణులు ఈ బియ్యం ప్రయోజనాలను వెల్లడించారన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ ఫోర్టిఫైడ్ బియ్యంలో ఎన్నో పోషకాలున్నాయని ఇటీవల ఇనిస్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ తెలిపిందని వివరించారు. బియ్యంలో అదనంగా జింక్, విటమిన్-ఎ థయమిన్, రైబోఫ్లేవిన్, నియాసిన్, విటమిన్ బీ6 పోషకాలు కలుపుతారని తెలిపారు. ఇలా ప్రాసెస్ చేసిన బియ్యాన్ని ఆహారంగా తీసుకోవడం ద్వారా మహిళల్లో రక్తహీనత సమస్య తగ్గుతుందని, చిన్న పిల్లల్లో రోగనిరోధక శక్తి పెరుగుతుందని నిపుణులు తెలిపారన్నారు. ఇన్ని ప్రయోజనాలు ఉన్న రేషన్ బియ్యాన్ని వండుకోకుండా తక్కువ ధరకు అమ్ముకుంటే ఆరోగ్యపరంగా నష్టపోతారని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారని పైర్కొన్నారు.

మూడుచోట్ల ఆధార్ క్యాంపులు



సఖినేటిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆధార్ క్యాంపును పర్యవేక్షిస్తున్న అధికారులు

సఖినేటిపల్లి: ప్రతి విద్యార్థికి ఆటోమేటిక్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ (అపార్) కార్డు కలిగి ఉండాలనే ఉద్దేశంతో శుక్రవారం మండలంలో మూడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో మండల విద్యాశాఖ ఆధార్ క్యాంపులను నిర్వహించింది. జిల్లా కలెక్టర్ ఆదేశాలపై డీఈవో సూచనలపై ఎంఈవో-1 డి.కిషోర్ కుమార్ వీటిని ఏర్పాటు చేశారు. మోరి, సఖినేటిపల్లి, అంతర్వేది దేవస్థానం ఉన్నత పాఠశాలలో విద్యార్థుల ఆధార్ కార్డుల్లో పేరు, పుట్టినతేదీ, తల్లిదండ్రుల పేర్ల మార్పు, చేర్పు చేయిస్తున్నట్టు ఎంఈఓ-1 అన్నారు. క్యాంపుల్లో ప్రభుత్వ విద్యార్థులతో పాటు, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు సౌలభ్యం కల్పించినట్టు కూడా ఎంఈఓ-1 అన్నారు. ఎంపీడీవో కె.సూర్యనారాయణ, ఇన్‌చార్జ్ తహసీల్దార్ సీహెచ్ భాస్కర్, ఏవో పీవీ నరసింహారావు క్యాంపులను పర్యవేక్షించారు. హెచ్ఎం కె.వీరాస్వామి, సచివాలయ ఆధార్ క్యాంపు సిబ్బంది, విద్యాశాఖ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఏఎన్ఎంలకు పని భారం తగ్గించాలి



ఎంపీడీఓ రాజుకు వినతిపత్రాన్ని అందజేస్తున్న సచివాలయ ఏఎన్ఎంలు

ఆలమూరు: గ్రామ సచివాలయం ఏఎన్ఎంలకు పనిభారం తగ్గించాలని ఎంపీడీఓ ఎ.రాజును కోరారు. చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీల్లో పనిచేస్తున్న గ్రామ సచివాలయ ఏఎన్ఎంలంతా శుక్రవారం ఎంపీడీఓ రాజును మర్యాదపూర్వకంగా కలసి తమ సమస్యలను విన్నవించారు. వైద్య ఆరోగ్యశాఖలోని విధులతో పాటు ఏకకాలంలో గ్రామ సచివాలయంలో విధులను కూడా నిర్వహించాలని అధికారుల నుంచి ఒత్తిడి ఎదురవుతుందన్నారు. ఇరు శాఖల పనులను ఒకేసారి ఎంత వరకూ చేయగలమంటూ వారు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ సచివాలయాల్లో పనిచేసే ఏఎన్ఎంలు కేవలం వైద్య ఆరోగ్యశాఖ ఆదేశించే పనులకే పరిమితం చేయాలని ఇప్పటికే ప్రభుత్వం ఉత్తర్వులు వెలువరించినా ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు. గ్రామ సచివాలయ ఏఎన్ఎంలు నిర్వర్తించే బాధ్యతలను ప్రభుత్వం జీఓ రూపంలో విడుదల చేసిన విషయాన్ని ఎంపీడీఓ రాజుకు వివరించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఎంపీడీఓ రాజుకు అందజేశారు. గ్రామ సచివాలయ ఏఎన్ఎంలు ఎదుర్కొంటున్న సమస్యలను, ప్రభుత్వం ఇప్పటికే విడుదల చేసిన జీఓలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరిస్తామని ఎంపీడీఓ రాజు తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

గిట్టుబాటు ధర కల్పించేందుకే ఫార్మర్స్ కంపెనీ



ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీని ప్రారంభిస్తున్న ఎంపీ హరీష్‌మాథుర్

మామిడికుదురు: రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించి వారికి అండగా నిలిచేందుకే ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీని ఏర్పాటు చేశారని అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధుర్ పేర్కొన్నారు. పాశర్లపూడిలో రైతులతో ఏర్పాటు చేసిన ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీని ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ కంపెనీ వల్ల ప్రధానంగా దళారుల ప్రమేయం లేకుండా రైతులకు మేలు జరుగుతుందన్నారు. ఈ తరహా కంపెనీలు మరిన్ని రావాల్సిన ఆవశ్యకత ఉందని చెప్పారు. కార్యక్రమంలో నాబార్డు డీడీఎం వై.సోమునాయుడు, జిల్లా వ్యవసాయాశాఖాధికారి ఒ.బోసుబాబు, హార్టీకల్చర్ అధికారి ఎం.శైలజ, కంపెనీ చీఫ్ మెంటర్ వేగి వెంకటేశ్వరరావు, సీఈఓ కాశిమళ్ల శ్రీనివాసరావు, చైర్మన్ సూదా వీరభద్రరావు, బీజేపీ జాతీయ కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యులు నల్లా పవన్, ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి దుర్గాప్రసాద్, సర్పంచ్ కొనుకు ప్రేమజ్యోతి, పి.గన్నవరం నియోజకవర్గ సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షులు అడబాల తాతకాపు, కూటమి నేతలు పాల్గొన్నారు.

సమస్యలను సమర్థంగా ఎదుర్కోవాలి



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న సీఐ విద్యాసాగర్

కొత్తపేట: సమాజంలో విద్యార్థినులకు ఎదురైన సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కోవాలని రావులపాలెం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ విద్యాసాగర్ సూచించారు. ఇటీవల మహిళలు, యువతులు, బాలికలపై జరుగుతున్న దాడులు, హత్యాచారాల నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం స్థానిక సిద్ధార్థ జూనియర్, శతాబ్ది డిగ్రీ కళాశాలల ప్రాంగణంలో ఆయా కళాశాలల విద్యార్థినులకు పోలీస్ శాఖ అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ కె.నాగమోహన్ అధ్యక్షతన జరిగిన సదస్సులో సీఐ విద్యాసాగర్ మాట్లాడుతూ అన్ని రంగాల్లోనూ మహిళలు ముందుకు వెళుతున్న నేటి సమాజంలో స్వీయ రక్షణలోనూ తమ సమర్థతను చాటాలని పిలుపునిచ్చారు. ఆయన మాట్లాడుతూ అన్ని విషయాలను తల్లిదండ్రులతో పంచుకోవాలన్నారు. ఏ సమస్య ఎదురైనా భయాన్ని వదిలి ధైర్యంగా 100, 112 కు ఫోన్ చేసి రిపోర్టు చేస్తే వెంటనే చర్యలు తీసుకుని రక్షణ కల్పిస్తామని భరోసా ఇచ్చారు. సమాజంలో స్త్రీ, పురుషులకు సమాన హక్కులు, చట్టాలు ఉన్నాయన్నారు. ప్రతి ఒక్కరూ బాలిక, మహిళా రక్షణ చట్టాలు అవగాహన చేసుకోవాలి సూచించారు. కార్యక్రమంలో స్థానిక ఎస్సై జి.సురేంద్ర, మహిళా హెచ్‌సీ అమరావతి, కళాశాల ఏఓ రెడ్డి సత్యనారాయణ, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీని సద్వినియోగం చేసుకోవాలి



నగరం భవిత కేంద్రం రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా సమన్వయకర్త సత్యనారాయణ

మామిడికుదురు: ఫిజియోథెరపీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని భవిత జిల్లా సహిత సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ సూచించారు. ఆయన శుక్రవారం నగరం గ్రామంలోని మొల్లేటివారి మెరక ఎంపీపీఎస్ స్కూల్‌లో భవిత కేంద్రాన్ని సందర్శించారు. ఫిజియోథెరపీ క్యాంపు, తరగతి గదిలోని విద్యార్థులను, వారి పురోగతిని పేరెంట్స్‌ను అడిగి తెలుసుకున్నారు. ప్రతి మంగళవారం ఫిజియోథెరపీ క్యాంపు నిర్వహిస్తారని దానికి విద్యార్థులు హాజరయ్యే విధంగా పేరెంట్స్ చొరవ తీసుకోవాలన్నారు. విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ పెరిగే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థులకు తగతిన తర్ఫీదు ఇవ్వాలని సూచించారు. ఆయన వెంట ఎంఈఓ ఎం.వెంకన్నబాబు, ఐఈఆర్పీలు కె.సుశీల, ఎస్.హిమబిందు, ఆయా లక్ష్మి, పేరెంట్స్ పాల్గొన్నారు.

వేతన బకాయిలు చెల్లించాలి

మామిడికుదురు/రాజోలు/పి.గన్నవరం/ సఖినేటిపల్లి: మూడు నెలలుగా వేతనాలు ఇవ్వక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, వెంటనే జీతాలు చెల్లించాలని కోరుతూ 104 ఉద్యోగులు శుక్రవారం ఆయా మండల తహసీల్దార్లు, ఎంపీడీవోలకు వినతిపత్రం ఇచ్చారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు వినతిపత్రాలు ఇచ్చామని ఉద్యోగులు సంఘం నాయకులు పేర్కొన్నారు. తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరారు.

విషాదయాత్ర

సోకిలేరులో జారిపడి యువకుడి మృతి

మోతుగూడెం: విహారయాత్రకు స్నేహితులతో వచ్చిన ఓ యువకుడు ప్రమాదవశాత్తూ సోకిలేరు వాగులో జారిపడి మృతి చెందాడు. అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలుకు చెందిన నలుగురు స్నేహితులు విహారయాత్రకు బైక్‌లపై వచ్చారు. దీనిలో భాగంగా సోకిలేరు వ్యూ పాయింట్ వద్ద ఆగి సెల్ఫీలు తీసుకున్నారు. అనంతరం స్నానాలు చేసేందుకు వాగు వద్దకు వెళ్లారు. వీరిలో గద్దం సత్యవరుణ్ (20) ప్రమాదవశాత్తూ కాలుజారి వాగులో పడి కొట్టుకుపోయాడు. అతడిని కాపాడేందుకు స్నేహితులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. వెంటనే వారు మోతుగూడెం ఎస్సై శివనారాయణకు సమాచారం అందించారు. పోలీసులు సోకిలేరు వద్దకు చేరుకున్నారు. ఘటన స్థలాన్ని పరిశీలించారు. వెంటనే దగ్గరలో ఉన్న లక్కవరం నుంచి గజ ఈతగాళ్లను రప్పించారు. గాలింపు చేపట్టిన కొద్దిసేపటికి సత్యవరుణ్ మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చింతూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

మధ్యాహ్న భోజన పథకం పరిశీలన



మామిడికుదురు హైస్కూల్‌లో తనిఖీ చేస్తున్న ఆర్డీఓ మాధవి

మామిడికుదురు: మధ్యాహ్న భోజన పథకం అమలు తీరు, విద్యార్థుల సిలబస్ తదితర అంశాలను అమలాపురం ఆర్డీఓ కె.మాధవి శుక్రవారం పరిశీలించారు. ఆమె మామిడికుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొమ్మిదో తరగతి విద్యార్థులకు సిలబస్ ఎంత వరకు పూర్తి అయిందన్న వివరాలను ఉపాధ్యాయుల నుంచి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజన పథకంలో వినియోగిస్తున్న బియ్యం, కోడిగుడ్ల నాణ్యతను ఆమె పరిశీలించారు. పీఎంశ్రీ పనుల ప్రగతిని, బిల్స్ అప్లేషన్‌ను తెలుసుకున్నారు. ఆధార్ అప్డేషన్ క్యాంపును పరిశీలించారు. అపార్ కార్డ్స్ వివరాలు తెలుసుకున్నారు. ఆమెతో పాటు ఎమ్మార్వో వైవీ సుబ్రహ్మణ్యాచార్యులు, ఈఓపీఆర్డీ అడబాల శ్రీనివాస్, ఎంఈఓలు ఎస్‌వీవీఎస్ లక్ష్మీనారాయణ, మోకా వెంకన్నబాబు, ఉపాధ్యాయులు ఆమె వెంట ఉన్నారు.

వెంకన్నకు అష్టోత్తర పూజలు

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలో శుక్రవారం స్వామి వారికి అష్టోత్తర పూజలు ఆలయ అర్చకులు ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామికి సుప్రభాతసేవ, నీరాజన మంత్రపుష్పం, పుణ్యాహవాచనం తదితర పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ఆవరణలో ఏడు శని వారాల నోము ఆచరించిన భక్తులు తమ మొక్కులు నెరవేరడంతో అధిక సంఖ్యలో భక్తులు అష్టోత్తర పూజలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

బాలికోన్నత పాఠశాలలో ఆకస్మిక తనిఖీ



కొత్తపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులతో మాట్లాడుతున్న ఆర్డీవో శ్రీకర్

కొత్తపేట: ప్రభుత్వ, జిల్లా పరిషత్ యాజమాన్య పాఠశాలల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించే లక్ష్యంగా ప్రణాళికా బద్ధంగా విద్యాబోధన అందించాలని స్థానిక ఆర్డీవో పి.శ్రీకర్ హెచ్ఎంలు, ఉపాధ్యాయులకు సూచించారు. శుక్రవారం మధ్యాహ్నం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థుల సంఖ్య, గతేడాది పదో తరగతి పరీక్షల్లో విద్యార్థుల ఉత్తీర్ణత శాతం, ఈ ఏడాది లక్ష్యాల గురించి ఆరా తీశారు. మధ్యాహ్న భోజన పథకం బియ్యం నాణ్యత, కోడిగుడ్లు ఎలా ఉన్నాయి? వారానికి ఎన్ని రోజులు సరఫరా చేస్తున్నారు? అని ఆరా తీశారు. పీఎంశ్రీ పనులు ఎంతవరకు పూర్తయ్యాయని పరిశీలించారు. అపార్ ఆధార్ కరెక్షన్ క్యాంపు సెంటర్‌ను సందర్శించి పలు అంశాలను ఆరా తీశారు. అనంతరం పలు తరగతులకు వెళ్లి పలు అంశాలపై విద్యార్థినులను ప్రశ్నించారు. మీ తల్లిదండ్రుల ఆశలు, ఆశయాలకు అనుగుణంగా క్రమశిక్షణతో కూడిన విద్యాభ్యాసంతో ఉత్తమ ఫలితాలు సాధించడం ద్వారా ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఉద్బోధించారు. ఆర్డీవో వెంట తహసీల్దార్ వై.రాంబాబు, ఆర్ఐ పి.రవిశంకర్, ఎంఈఓలు ఎం.హరి ప్రసాద్, కె.లీలావతి, హెచ్ఎం ఎస్ సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

పంచాయతీ అనుమతి లేని చర్చిని తొలగించాలి



కత్తిమండ పంచాయతీలో పిటిషన్ అందించిన ఎస్సీ కాలనీవాసులు

మలికిపురం: మండలంలోని కత్తిమండ ఎస్సీ కాలనీలో పంచాయతీ అనుమతి లేకుండా నడుపుతున్న చర్చిని తొలగించి, సదరు పాస్టర్‌పై పోలీసు శాఖ ద్వారా తగిన చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శికి కాలనీ వాసులు శుక్రవారం ఫిర్యాదు చేశారు. చర్చిని తొలగించమని పంచాయతీకి గతంలో పలు పర్యాయాలు కోరామని, అయితే చర్యలు తీసుకోవడంలో జాప్యం చూపుతున్నారని పేర్కొన్నారు. తాజాగా శుక్రవారం పాస్టర్ కాలనీలోకి వచ్చి, హిందూ ఆరాధ్యదేవుళ్లపై తప్పుడు ఆరోపణలు చేశారని, వారు శక్తిహీనులు అంటూ అనేక దుర్భాషలాడారని వెల్లడించారు. ఫిర్యాదుపై సంతకాలు చేసిన వారిలో సీహెచ్ సత్యనారాయణ, కొల్లు ఏడుకొండలు, ఎ.అర్జున్, కె.రఘురామయ్య, ఎ.ఈశ్వరరావు, చింతా శ్రీను, ఎస్.నరసింహారావు ఉన్నారు. ఇదిలా ఉండగా కాలనీవాసులు ఇచ్చిన పిటిషన్‌పై పంచాయతీ పాలకవర్గం తీర్మానం చేసి కలెక్టర్‌కు పంపిస్తామని కార్యదర్శి అన్నారు.

గర్భిణులకు ప్రత్యేక వైద్య పరీక్షలు



గర్భిణులకు పౌష్టికాహారం అందజేస్తున్న దాతలు

పి.గన్నవరం: ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం 23 మంది గర్భిణులకు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో ఐదుగురిని హైరిస్క్ కేసులుగా గుర్తించారు. వై.కొత్తపల్లికి చెందిన వేణి ఫౌండేషన్ చైర్మన్ నల్లా గంగాతఈశ్వరరావు ఆధ్వర్యంలో గర్భిణులకు, వారి సహాయకులకు పౌష్టికాహారం అందజేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ యు.రాఘవేంద్రరావు, వైద్యాధికారులు పాల్గొన్నారు.

స్వామివారి సన్నిధిలో శ్రీ క్షేత్రం క్షేత్రాధిపతి

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో శుక్రవారం తెలంగాణ రాష్ట్రానికి చెందిన సిద్దిపేట శ్రీక్షేత్రం క్షేత్రాధిపతి మధుసూదనానంద సరస్వతి స్వామీజీ, స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. స్వామిజీకి ఆలయ అర్చకులు ఆలయ సంప్రదాయం ప్రకారం స్వాగతం పలికారు. స్వామిజీకి స్వామివారి చిత్రపటంను ఆలయ ఏసీ వి.సత్యనారాయణ అందజేశారు.

న్యాయ అవగాహన సదస్సు

రాజోలు: స్థానిక సమీకృత బాలికల వసతి గృహంలో శుక్రవారం జాతీయ న్యాయ సేవా దినోత్సవం నిర్వహించారు. న్యాయ అవగాహన సదస్సుకు మండల లీగల్ సెల్ కమిటీ చైర్‌పర్సన్ పి.ప్రమీల రాణి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. బాలికా సంరక్షణ చట్టాలపై అవగాహన కల్పించారు. న్యాయవాదులు పాల్గొన్నారు.

లక్ష బిల్వార్చన

అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామివారి ఆలయంలో కొలువుదీరిన అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామికి శుక్రవారం భక్తులు భక్తిశ్రద్ధలతో బిల్వార్చన నిర్వహించారు. స్వామికి ఆలయ ప్రధానార్చకులు అల్లవరపు సూరిబాబు, బాల సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ఏకాదశ రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన పూజలు జరిపారు. సాయంత్రం అమ్మవారికి భారీ ఎత్తున మహిళలు లక్ష కుంకుమ పూజలు జరిపారు.